గడువులోగా స్థానిక ఎన్నికలు

- బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జిఒ
- 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణ
- వరద నష్టంపై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారులతో సమావేశం
- గోశాలల అభివృద్ధికి సంక్షేమ బోర్డు
- సిఎంఆర్ చెల్లించని మిల్లర్లపై పిడి యాక్ట్
- మత్స్య సహకార సంఘాలకు పర్సనల్ ఇన్‌ఛార్జుల నియామకం
- నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టుకు ఆమోదం
- క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం శాసనసభలో భేటీ అయిన తెలంగాణ క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతో పాటు, ఇటీవల వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై చర్చించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను క్యాబినెట్ ఆమోదించి, గవర్నర్‌కు సిఫారస్ చేసింది. క్యాబినెట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి వర్గ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ సచివాలయంలో మీడియాకు వెల్లడించారు. "కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఎస్సి, ఎస్‌టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటాయి. 2018 పంచాయతీ రాజ్ చట్టంలోని 285(ఏ) చట్టానికి సవరణకు ప్రతిపాదించాం. అలాగే 2019 మున్సిపల్ యాక్ట్‌లోని 50 శాతం సీలింగ్ ఎత్తివేయడానికి తెచ్చిన ఆర్డినెన్స్‌ను శాసనసభలో పెట్టి అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం. సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు నిర్దేశిత గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది" అని వారు వెల్లడించారు. వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాలపై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. భారీ ప్రకృతి విపత్తు వల్ల పంట, ఆస్తి, రహదారులకు పెద్ద మొత్తంలో నష్టం జరిగిందన్నారు. వీటన్నింటిపై చర్చించి సత్వరం చేపట్టాల్సిన పనులపై నిర్ణయం తీసుకోవడంతో పాటు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వివరించారు. రాష్ట్రంలో గోశాల పాలసీ విధివిధానాలపై మంత్రివర్గం చర్చించినట్టు తెలిపారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కొలిచే సాంకేతికత, తదితర అంశాలకు సంబంధించి నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్‌కు ఆమోదం తెలిపారు. 2022-23 రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని మంత్రులు తెలిపారు. సీఎంఆర్ కింద ప్రభుత్వానికి ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన బియ్యం రావాల్సి ఉందన్నారు. గత సర్కార్ హయాంలో జరిగిన అక్రమాలకు సంబంధించి విచారణ చేసి అవసరమైతే మిల్లలర్లపై పిడి యాక్ట్ పెడతామని ప్రకటించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను క్యాబినెట్ సిఫార్సు చేసిందని తెలిపారు. మత్స్య కార్మిక సహకార సంఘాల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశమున్నందున పర్సనల్ ఇన్‌ఛార్జులను నియమించనున్నట్టు మంత్రులు పొంగులేటి, పొన్నంలు మంత్రి వర్గ నిర్ణయాలను వెల్లడించారు.

అసెంబ్లీ ఇంకా రెండు రోజులే.?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు రెండు రోజులే జరిగే అవకాశముంది. ఈ మేరకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బిఎసి) సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ రెండు రోజుల్లో మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన రెండు చట్టాలకు సవరణలు ప్రతిపాదించనుంది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సర్కారు తీసుకొచ్చిన ప్రత్యేక జిఓపై ఆదివారం శాసనసభలో చర్చించనుంది. వీటితో పాటు కాళేశ్వరం కమిషన్ నివేదికను భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం శాసనసభలో ప్రవేశ పెట్టనున్నారు. అనంతరం ఈ నివేదికపై చర్చ జరపాలని సర్కారు నిర్ణయించింది. శనివారం అసెంబ్లీలోని సభాపతి చాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బిఎసి సమావేశమైంది. అధికార కాంగ్రెస్ నుంచి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, బిఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బిజెపి నుంచి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా సబ్యసాచి ఘోష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంశుసంవర్దక, మత్స్య శాఖ ప్రత్యేక కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌కు తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహించిన అలగు వర్షిణి కేంద్ర సర్వీసులకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె శనివారం విధులనుంచి రిలీవ్ అయినట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఉర్దూ జర్నలిస్టులకు వంద కంప్యూటర్లు

- అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హమ్దన్

పజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉర్దూ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి వంద కంప్యూటర్లు సమకూర్చడానికి వెనుకబడిన తరగతులు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంగీకరించారని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హమ్దన్ తెలిపారు. శనివారం తెలంగాణ మీడియా అకాడమీ హైదరాబాదులో నిర్వహిస్తున్న ఉర్దూ జర్నలిస్టుల పునఃచరణ తరగతుల ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్ర జర్నలిస్టులకు ముఖ్యంగా ఉర్దూ జర్నలిస్టుల నైపుణ్యాన్ని పెంచే విధంగా ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని ఉర్దూ జర్నలిస్టుల కోసం ఉర్దూ అకాడమీ ద్వారా సహాయం చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... మాతృభాషకు తగినంత ప్రేరణ, ఆదరణ ఇవ్వాలని అన్నారు. యూరప్ ఖండంలోని ఫ్రెంచ్, జర్మనీ, క్యూబా, ఇటలీ దేశాల ప్రజలు ప్రభుత్వం వారి మాతృభాషల్లోనే కార్యకలాపాలు చేస్తున్నారని అన్నారు. మన రాష్ట్ర అధికారిక భాషలైన తెలుగు, ఉర్దూ భాషలకు మనమంతా ప్రాధాన్యతనిచ్చి అన్ని కార్యకలాపాలు మాతృభాషలోనే చేయాలని తెలిపారు. మీడియా అకాడమీ జిల్లాలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నదన్నారు. సెప్టెంబర్, 3వ తేదీన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫ్యాక్ట్ చెక్, సైబర్ నేరాలపై ప్రత్యేక వర్క్ షాప్ అకాడమీ నిర్వహిస్తున్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉర్దూ జర్నలిస్ట్ మాజీద్, మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుడిచిపెట్టుకుపోయింది

- పంటలను నిండా ముంచిన వరదలు
- వరి, సోయా.. ఇతర పంటలకు తీవ్ర నష్టం
- 91,082 ఎకరాల్లో పంటలకు నష్టం
- పరిహారం చెల్లించాలని నిజామాబాద్ రైతుల మొర

పంటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల కష్టం వర్షార్పణం అయ్యింది. భారీ వర్షాలతో వచ్చిన వరద.. రైతుల పెట్టుబడులను తుడిచిపెట్టేశాయి. మోకాలు లోతు వరకు వరద నీరు పంటపొలాలను కమ్మేశాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 91,082 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నిజామాబాద్ జిల్లాలో 41,098 ఎకరాలు, కామారెడ్డిలో అత్యధికంగా 49,984 ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. వరదతో పాటు రాళ్లు, ఇసుక మేటలు వేయడంతో తీవ్ర నష్టం నెలకొంది. పెట్టిన పెట్టుబడులు, తమ కష్టం పూర్తిగా నీటిపాలైందని రైతులు వాపోతున్నారు. ఇసుక మేటలు తొలగించేందుకు మరింత ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు.

ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరదల తాకిడితో ఎక్కడికక్కడ వరద నీరు పంటలను ముంచెత్తాయి. వరద నీటితో పంటపొలాలు చెరువులు తలపించాయి. నిజామాబాద్ జిల్లాలో 20,660 మంది రైతులకు చెందిన 41,098 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి 28 వేల ఎకరాలు, సోయాబీన్ 12054, మొక్కజొన్న 565 ఎకరాలతో పాటు ఇతర పంటలు నష్టపోయినట్టు వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. ఇక కామారెడ్డిలో ఏకంగా 49,984 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు అంచనాలు రూపొందించారు. అధికారిక లెక్కల కంటే ఇంకా అధికంగా పంటలకు నష్టం వాటిల్లినట్టు రైతులు పేర్కొంటున్నారు.

రాళ్లు రప్పలు, ఇసుక మేటలు

పంటపొలాల్లోకి వరదతో పాటు రాళ్లు, ఇసుక వచ్చి చేరింది. ఇప్పటికే పంట నష్టపోగా.. దీనికి తోడు భూమిని మళ్లీ పంటలకు సిద్ధం చేసేందుకు డబ్బులు వెచ్చించే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. దాంతో పాటు కరెంట్ స్తంభాలు విరిగి పోగా.. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ములిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా పొలాలతో పాటు బోర్లలో నీరు పోవడంతో బోరుమోటార్లు పాడైపోయాయి. ఇవన్నీ బాగు చేసేందుకు తలకుమించిన భారం అవుతుందని రైతులు కంటతడి పెట్టుకుంటున్నారు.

విపత్తుగా ప్రకటించి పరిహారం ప్రకటించాలని రైతుల డిమాండ్

కాగా వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి పరిహారం ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని.. పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. కేంద్రం సైతం తమ ప్రతినిధి బృందాన్ని పంపించి విచారణ చేయించి నిధులు కేటాయించాలనే డిమాండ్ స్థానికంగా నెలకొంది. ఎకరాకు ఇప్పటి వరకు 20-25 వేల రూపాయల వరకు పెట్టిన పెట్టుబడులు వర్షార్పణం అయ్యాయని.. ఎకరానికి రూ.30 వేల పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి : సిపిఎం నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

వరదలతో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌తో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్రం నిధులు ప్రకటించాలి. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.20వేలు పరిహారం చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలి. వర్షాలతో వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోయాయని కావున వ్యవసాయ కార్మిక కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.2000 చొప్పున చెల్లించాలి.

లోగోను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

మెదక్‌లో సిఐటియు రాష్ట్ర మహాసభ

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వాహణ
- లోగోను ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర ఐదో మహాసభ డిసెంబరు ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు మెదక్‌లో జరగబోతున్నాయి. ఆ మహాసభకు సంబంధించిన లోగోను శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ.. మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాట్లు చేస్తున్నదనీ, ఈ మహాసభల సందర్భంగా ప్రతి గ్రామంలో సిఐటియు అనుబంధ సంఘాల సభ్యులతో, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులతో సమావేశాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించబోతున్నామని వివరించారు. కార్మిక వర్గం, శ్రేయోభిలాషులు, మేధావులందరు కూడా ఈ మహాసభల జయప్రదానికి సహకరించాలనీ, ఆహ్వాన సంఘం చేసే ఏర్పాట్లకు మెదక్ పట్టణ ప్రజలు కూడా సహకరించాలని కోరారు. మహాసభల లోగో ఆవిష్కరణలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర సీనియర్ నాయకులు పి.రాజారావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఎస్.వీరయ్య, జె.వెంకటేష్, ఎస్‌వి రమ, కళ్యాణం వెంకటేశ్వరరావు, టి.వీరారెడ్డి, వంగూరు రాములు, కె.ఈశ్వర్ రావు, ఎం.పద్మశ్రీ, బి.మధు, వి.ఎస్.రావు, కురపాటి రమేష్, కాసు మాదవి, ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ ఆడివయ్య, సిఐటియు మెదక్ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ డిజిపి పదవీ విరమణ

- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జిగా విక్రమ్‌సింగ్‌మాన్
- సెప్టెంబర్‌లో రాష్ట్ర డిజిపి జితేందర్ రిటైర్మెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్ ఐపిఎస్ అధికారి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిపి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. నిజానికి ఆదివారం(రేపటితో) ఆయన పదవీ కాలం ముగుస్తుంది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి 1994వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపిఎస్ అధికారి పోలీసు శాఖలో చేరాక ఆయన మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌పిగా, నగర ట్రాఫిక్ డిసిపిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రేంజ్‌ల డిఐజిగా పనిచేశారు. అనంతరం డిజిపిగా పదోన్నతి పొందాక రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలను నిర్వహించారు. ముఖ్యంగా రాష్ట్రంలో అవినీతి ఆరోపణలకు దారి తీసిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవటానికి గల కారణాలపై శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వానికి ఒక నివేదికను కూడా సమర్పించారు. ముక్కుసూటిగా వ్యవహరించే ఐపిఎస్ అధికారిగా పేరు పొందిన శ్రీనివాస్‌రెడ్డి జాతీయస్థాయిలో ఐపిఎం, పిపిఎం అవార్డులను సైతం పొందారు. పదవీ విరమణ చేస్తున్న ఆయన స్థానంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జి డిజిగా హైదరాబాద్ నగర అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్‌సింగ్‌మాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది.

జాన్‌వెస్లీని పరామర్శిస్తున్న నాయకులు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హౌస్ అరెస్టు

- అనాజిపూర్ భూములను పేదలకివ్వాలని చలో అసెంబ్లీకి పిలుపు
- ఆ భూముల్ని రామోజీ ఫిలింసిటీకి కట్టబెట్టొద్దని డిమాండ్
- పరామర్శించిన ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజిపూర్ భూములను అక్రమంగా రామోజీ ఫిలిం సిటీకి కట్టబెట్టడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆ జిల్లా కమిటీ చలో అసెంబ్లీ ముట్టడి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని శనివారం హైదరాబాద్‌లో పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఆ పిలుపులో భాగంగా జాన్‌వెస్లీ అసెంబ్లీకి వెళ్తారనే కారణంతో శనివారం ఉదయం నుంచే ఆయన ఇంటి వద్ద పోలీసులు పహారా కాశారు. ఆయన్ను ఇంటి నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. నెలరోజులుగా సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనాజిపూర్ భూముల్ని పేదలకు పంచాలని పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతున్నాయి. ఆ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న జాన్‌వెస్లీని ఇటీవలే అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లాలో అరెస్టులు, నిర్బంధాల పర్వం కొనసాగుతోంది.

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా అనాజిపూర్ భూమి సమస్యలను పరిష్కరించి, పేద ప్రజలకు హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే జాన్‌వెస్లీని ముందస్తుగా హౌస్‌అరెస్టు చేశారు.

వివిధ ప్రజాసంఘాల రాష్ట్ర నేతల పరామర్శ

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్ బాబు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్ తెలంగాణ ప్రయివేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదరి ఐ.విజయ్ కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు, ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, పాటల గోపి తదితరులు జాన్‌వెస్లీని పరామర్శించారు. వెస్లీ అరెస్టును వారు తీవ్రంగా ఖండించారు. పేదలకు న్యాయం చేయాలని ప్రశ్నిస్తుంటే నిర్బంధించడం తగదని హెచ్చరించారు. వెస్లీ అరెస్టును ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని పిలుపునిచ్చారు.

గోపీనాథ్ అకాల మరణం తీరని లోటు

- సంతాప తీర్మానం సందర్భంగా అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఉండి ఇటీవల మరణించిన మాగంటి గోపీనాథ్ చూడటానికి చాలా క్లాస్‌గా కనిపించినా..ఆయన ఆ నియోజకవర్గంలో మాస్ లీడర్‌గా పేరొందారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆయన అకాల మరణం సభకు తీరని లోటు అని చెబుతూ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. శనివారం శాసనసభ ఆరో సెషన్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మాగంటి గోపీనాథ్ మృతికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గోపీనాథ్ విద్యార్థిగా ఉన్న సమయంలోనే 1983 నుంచి టిడిపిలో చురుగ్గా ఉండేవారనీ, 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారని గుర్తుచేశారు. 1987-88లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా, 1988-93 లో జిల్లా వినియోగదారుల ఫోరం బాధ్యులుగా సేవలందించారని తెలిపారు. సినీరంగంలో నిర్మాతగా రాణించారన్నారు. పార్టీలు వేరైనా మాగంటి గోపీనాథ్ వ్యక్తిగతంగా తనకు మంచి మిత్రుడని చెప్పారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ఘనత సాధించిన వారిలో ఆయన ఒకరని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ...గోపీనాథ్ అన్న మరణం దిగ్భ్రాంతికరమన్నారు. బిఆర్ఎస్ సభ్యులు కే.తారకరామారావు(కేటీఆర్) మాట్లాడుతూ...తమ పార్టీ హైదరాబాద్ నగర అధ్యక్షులుగా ఉన్న గోపీనాథ్ మృతికి సంతాపం ప్రకటించాల్సి రావడం బాధాకరంగా ఉందన్నారు. గోపీనాథ్ కుటుంబానికి తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..గోపీనాథ్ మృతి బాధాకరమన్నారు. ఆయన మంచి ఆర్గనైజర్ అని చెప్పారు. ఎంఐఎం సభ్యులు బలాల మాట్లాడుతూ..మాగంటి సౌమ్యుడనీ, తన పనితాను చేసుకుంటూ పోయేవాడని గుర్తుచేశారు. సాధారణ జీవితం గడుపుతూ జూబ్లీహిల్స్ ప్రజల మనస్సును వరుసగా మూడుసార్లు గెలిచాడన్నారు. బిజెపి సభ్యులు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ..ఎన్‌టిఆర్‌ను గోపీనాథ్ ఆరాధించేవారని గుర్తుచేశారు. సంతాప తీర్మానంపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్, కెపి.వివేకానంద, ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్ మాట్లాడారు. అనంతరం గోపీనాథ్ మృతికి శాసనసభ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సభను ఆదివారం ఉదయానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

బురద రాజకీయాలే మీకు ముఖ్యమా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని బిఎసి సమావేశంలో సూచించాలని మాజీ మంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. శనివారం హైదారాబాద్‌లోని శాసన సభ మీడియా పాయింట్ వద్ద అయన మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత వరదలపై, రెండో ప్రాధాన్యత యూరియాపై చర్చించాలని కోరామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని చెప్పారు. విద్యార్థుల మరణంపై చర్చ జరగాలన్నారు. ఫోర్త్ సిటీ పేరున జరుగుతున్న అక్రమాలు, సిఎం కుటుంబ సభ్యులపై చర్చ కోరామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్‌సి, బెనిఫిట్లపై, హైడ్రా కూల్చివేతలు, ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై చర్చించాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందిచని ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఎసి నుండి వాకౌట్ చేశామని తెలిపారు. వరద బాధితుల గురించి కాకుండా బురద జల్లే రాజకీయాలు అసెంబ్లీలో మాట్లాడటమేంటని ప్రశ్నించారు. అదే మీకు ముఖ్యమా? అని సిఎంను ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించకపోవడమే ప్రజా పాలనా? అని ప్రశ్నించారు. కనీసం 15 రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సహకరించండి : ఆది శ్రీనివాస్

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల్లో బిసిలకు అన్యాయం చేస్తూ కెసిఆర్ చట్టం చేశారని గుర్తు చేశారు. బిసిలకు న్యాయం చేసే విధంగా చర్య, చర్చ జరగబోతుందన్నారు. ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. కేంద్రం నిధుల విషయంలో వివక్ష చూపిస్తున్నదని విమర్శించారు. యూరియా విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుని, ఆ నిందను తమ ప్రభుత్వంపై వేయటం తగదన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నూర్జహాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలకు రాష్ట్రంలోని రైతాంగం పంట నీట మునిగి పూర్తిగా నష్టపోయారని, ఈ విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలో భారీ వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను పార్టీ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలతో పాటు ఇండ్లు ధ్వంసమై నిరాశ్రయులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. గుంతలు ఏర్పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. నష్టపోయిన నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకర్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, మండల కన్వీనర్ నెల్లూరి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం చేయండి

- ఇండియన్ బ్యాంక్ అధికారులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు దశాబ్దాల క్రితం తప్పిపోయిన ఉద్యోగి కుటుంబానికి సదరు ఉద్యోగి పదవీ విరమణ బెనిఫిట్స్ అమలు చేయాలనీ, అతని కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ఇండియన్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. 1991లో బ్యాంకులో చేరి 2004లో అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన వి.ఫ్రాన్సిస్ ఢిల్లీకి బదిలీపై వెళ్లారు. ఏడు నెలల తర్వాత అతను కనిపించలేదు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేసి కనబడలేదని రిపోర్టు ఇచ్చారు. దీనిపై అతని భార్య దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో హైకోర్టు ఉఉత్తర్వులను జారీ చేసింది. ఢిల్లీకి బదిలీ తర్వాత కేవలం ఏడు నెలలు పని చేసిన తర్వాత ఆయన కనిపించకుండా పోయారు. 2008లో తప్పిపోయినట్టు ఫిర్యాదు అందినప్పటికీ, 2010లో ఆయన జాడ తెలియడం లేదని పోలీసులు నిర్ధారించి నివేదిక ఇచ్చారు. దీంతో బ్యాంకు ఫ్రాన్సిస్ తప్పనిసరి రిటైర్మెంట్ ఇచ్చినట్టుగా ప్రకటించింది.

2012లో చట్టపరమైన వారసుడు సర్టిఫికెట్ పొందిన తర్వాత, పిటిషనర్ పదవీ విరమణ ప్రయోజనాలు, కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకుంటే బ్యాంకు పట్టించుకోలేదు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 108 ప్రకారం, ఏడు సంవత్సరాలకుపైగా తప్పిపోయిన వ్యక్తిని చనిపోయినట్టు భావిస్తారని, కాబట్టి భార్యకు బెనిఫిట్స్ చెల్లించాలనీ, వారి పిల్లల్లో అర్హులైన ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బ్యాంకుకు జస్టిస్ భీమపాక నగేష్ ఆదేశిస్తూ తీర్పు చెప్పారు. భార్య క్యాన్సర్ రోగి అనీ, ఆమె పిల్లల్లో ఒకరికి కారుణ్య నియామకం చేయాలని ఆదేశించారు. పిటిషనర్ వినతిపత్రంపై అధికారులు స్పందించకపోవడంతో బ్యాంకుకు రూ.50 వేలు జరిమానా విధించారు.

బడుల బలోపేతానికి ప్రీ ప్రైమరీ

- సర్కారు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి
- విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, షూ, టై, బెల్ట్ అందజేత
- హైదరాబాద్ జిల్లాలో తొలుత 25 పాఠశాలల్లో ప్రారంభానికి కసరత్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేట్ పాఠశాలలకే పరిమితమైన నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి తరగతులు ఇక నుంచి ప్రభుత్వ బడుల్లోనూ కొనసాగనున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. అయితే, అంగన్‌వాడీ సెంటర్లలో పూర్వ ప్రాథమిక విద్య కొనసాగుతున్నా.. అధిక శాతం ప్రయివేటు పాఠశాలల్లోనే ఈ విధానం నడుస్తోంది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగడం లేదు. ఇందులో మార్పు తీసుకొచ్చేందుకు ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ఏర్పాటుపై రేవంత్ సర్కారు దృష్టిసారించింది.

హైదరాబాద్ జిల్లాలో 691 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 94వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వ బడుల్లో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి తరగతులు ఉండవనే విషయం తెలిసిందే. ఒకటో తరగతి నుంచే ప్రవేశాలు కల్పిస్తారు. ప్రయివేటులో ఆంగ్ల మాధ్యమంతోపాటు నర్సరీ నుంచే ప్రవేశాలు తీసుకుంటారు. అందుకే తల్లిదండ్రులు పిల్లలను రూ.వేలల్లో ఫీజులు చెల్లించి మూడు నుంచి నాలుగేండ్లు నిండగానే ప్రయివేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ స్కూళ్లలో ప్రతియేటా ప్రవేశాలు తగ్గుతున్నాయి. ఆంగ్ల మాధ్యమం అమలు చేస్తున్నా విద్యార్థులను చేర్పించడానికి తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ బడుల్లో

పూర్వప్రాథమిక విద్యను ప్రారంభిస్తే ప్రవేశాలు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. తొలి విడతగా ఈ విధానాన్ని హైదరాబాద్ జిల్లాలోని 25 పాఠశాలల్లో ప్రారంభించనున్నారు.

బోధన ఇలా..

నూతనంగా ప్రారంభించనున్న ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో రకరకాల సామగ్రితో ఆటపాటలతో విద్యాబోధన చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. కాగా, జిల్లాలోని అన్ని మండలాల నుంచి మొదటి విడతగా 25 పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలలో తరగతి గదులకు రంగులు, అందమైన చిత్రపటాలు ఏర్పాటు చేయడంతోపాటు ఆట వస్తువులు, బొమ్మలు పెట్టనున్నారు. అంతేకాకుండా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున అందజేయనున్నది. వీటితో స్టేషనరీ, నోట్ పుస్తకాలు, చార్టు పేపర్లు, ఇతర వాటికోసం వినియోగించనున్నారు. దీనికి సంబంధించిన నిధులు కూడా ప్రభుత్వం ఇవ్వనుంది. అలాగే.. బెల్ట్, షూస్, టై, బెల్ట్, పుస్తకాలు ఉచితంగా అందించనుంది. పిల్లలకు స్నాక్స్‌తో పాటు మధ్యాహ్నం భోజనం అందిస్తారు.

దరఖాస్తుల స్వీకరణ షురూ

ప్రీప్రైమరీ విద్యను బోధించేందుకు ఒక ఇన్‌స్ట్రక్టర్, పిల్లలను చూసుకోవడానికి ఆయాను నియమించనుండగా.. ఇప్పటికే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో 18 నుంచి 40 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న ఒకరిని తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయుడిగా నియమిస్తారు. కనీసం ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఉండాలి. సైకాలజీ సబ్జెక్టుపై పట్టు ఉన్న వారితోపాటు అదే మండలానికి చెందిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఆయా పోస్టుకు.

ఏడో తరగతి చదివి ఉండాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయుని పర్యవేక్షణలోనే ప్రీ ప్రైమరీ కొనసాగుతుంది. ఇందుకోసం స్వీకరించిన దరఖాస్తులను జిల్లా అధికారులు పరిశీలించి నియామకాలు చేపట్టనున్నారు. ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.ఎనిమిదివేలు, ఆయాకు రూ.ఆరువేల వేతనం అందజేస్తారు. ఇదిలావుంటే, పూర్వ ప్రాథమిక విద్య ప్రవేశంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు బలోపేతం కానున్నాయనే అభిప్రాయాలు ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

బచ్చల వినోద్

సిపిఎం జగిత్యాల జిల్లా కన్వీనర్‌గా వినోద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం జగిత్యాల జిల్లా కన్వీనర్‌గా బచ్చల వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా కమిటీ సభ్యురాలు ఇందూరి సులోచన అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే వినోద్‌ను పార్టీ జిల్లా కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో మళ్లీ భూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. జగిత్యాల జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసి సరిపడా యూరియా అందించడంలో, తెప్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖండిస్తూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ఎం.ఎ.చౌదరి, కోమటి చంద్రశేఖర్, వి.వెంకటచారి, కుంచం శంకర్, మల్యాల సురేష్, మహిపాల్ నాయక్, బోర్ర శేఖర్, ఇందూరి సులోచన, నాయిని శారద తదితరులు పాల్గొన్నారు.

అర్జీల గురించి తెలుసుకుంటున్న అయోధ్యరెడ్డి

ఆర్జీలను త్వరగా పరిష్కరించాలి

- మహబూబాబాద్‌లో ఆర్‌టిఐ బృంద సభ్యుల పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాచార హక్కు చట్టం ద్వారా పెట్టిన ఆర్జీలను త్వరగా పరిష్కరించేలా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 18,000 దరఖాస్తుల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు అవగాహన కల్పిస్తున్నట్టు రాష్ట్ర సమాచార కమిషన్ బృంద సభ్యులు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావు, మోహ్సినా పర్వీన్, దేశాల భూపాల్ తెలిపారు. శనివారం మహబూబాబాద్‌లో పర్యటించిన ఆర్‌టిఐ బృంద సభ్యులు ముందుగా.. కలెక్టరేట్ ప్రాంగణంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి మొక్క నాటారు. అనంతరం జిల్లాలోని పిఐఒఎస్, ఎపిఐఒఎస్, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చట్టం అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాచార అధికారులు, సహాయ సమాచార అధికారులు చట్టం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజలను సహృదయంతో అర్థం చేసుకొని వారి అర్జీలను స్వీకరించి, నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం దుర్వినియోగం చేసే వారి పట్ల కూడా ప్రజా ప్రయోజనాలకు సంబంధించి జాగ్రత్తగా పరిశీలించి, పరిష్కరించాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలులో దేశంలో తెలంగాణ 8వ స్థానంలో ఉందని అన్నారు. చట్టంలోని కొన్ని కీలకమైన సెక్షన్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులను కూడా దృష్టిలో పెట్టుకుని ఆర్జీలను పరిష్కరించొచ్చని తెలిపారు. దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోపు సమాధానాలు ఇవ్వకపోతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజూ నగదు జరిమానా విధించనున్నట్టు తెలిపారు. కాబట్టి, అధికారులు జాగ్రత్త వహించి నిర్ణీత కాలవ్యవధిలో ఆర్జీలను పరిష్కరించాలని సూచించారు. అధికారులు, సమాచార కమిషనర్లు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, విధుల పట్ల అలసత్వం వహించొద్దని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో అన్ని విభాగాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అనంతరం జిల్లా సమాచార కమిషన్ ముందుకు వచ్చిన 12 శాఖలపై 115అప్పీళ్లను బృంద సభ్యులు పరిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్‌పి సుధీర్, రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో (స్థానిక సంస్థలు), కె.అనిల్ కుమార్(రెవెన్యూ) తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల కట్టడికి ప్రజా ఉద్యమం అవసరం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాదకద్రవ్యాల కట్టడికి ఓ ప్రజా ఉద్యమం అవసరమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ లా విభాగం, విజన్ 2047 ప్రొఫెషనల్ ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం ఓయూ దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో "కంబాటింగ్ డ్రగ్ అబ్యూజ్ ఇన్ ఇండియా- లీగల్ అండ్ పాలసీ పర్‌స్పెక్టివ్" అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. మాదకద్రవ్యాల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతికతతో ఏదైనా సాధించే దశకు చేరుకున్నామని, ఆపరేషన్ సింధూర్ ద్వారా సాంకేతికతలో మన సత్తా చాటామని అన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైతే ఏ సాంకేతికత, అభివృద్ధి మనల్ని కాపాడలేవని హెచ్చరించారు. యువతకు చట్టాలపై అవగాహన ఉన్నా మత్తు పదార్థాలకు బానిసలై నేరాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.సిబిఐ పూర్వ సంయుక్త సంచాలకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల కట్టడితోపాటు దేశంలో జరుగుతున్న నేరాల్లో దోషులకు శిక్షలు పడేందుకు న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ కలిసి పనిచేయాలని సూచించారు. విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ హరిచరణ్ మాట్లాడుతూ.. 2047 నాటికి డ్రగ్స్ ఫ్రీ భారత్ దిశగా అడుగులు వేద్దామని, ఇందుకు కేంద్రం అవసరమైన చట్టాల రూపకల్పన, చర్యలు చేపట్టాలని కోరారు. ఓయూ రిజిస్ట్రార్ ఆచార్య జి.నరేష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ లా కళాశాల ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఓయూ లా కళాశాల డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగంతో పాటు ఆధునిక సాంకేతికత తెచ్చిన అనేక సమస్యలు భారతీయ కుటుంబ వ్యవస్థకు సవాల్‌గా మారాయని చెప్పారు. ఓయూ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం, పర్యవసానాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ చరణ్, డాక్టర్ రత్నాకర్‌రావు, నల్లారి రాజేందర్, ఓయూ ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, సహా అధ్యాపకులు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, పలు లా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

లాలాగూడ సెంట్రల్ ఆస్పత్రిలో 2డి ఎకో, ఆక్సిజన్ మ్యాని ఫోల్డ్ రూమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లాలాగూడ సెంట్రల్ ఆస్పత్రిలో డిజి (ఐఆర్‌హెచ్‌ఎస్) 2డి ఎకో, ఆక్సిజన్ మ్యాని ఫోల్డ్ రూమ్,పునరుద్ధరించిన ఫిజియోథెరపీ రూమ్, డెడికేటెడ్ కార్పొరేట్ బిల్లింగ్ సెక్షన్ కార్యాలయం సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్ లాలాగూడలోని సెంట్రల్ ఆస్పత్రిలో శనివారం తనిఖీలు నిర్వహించిన అనంతరం ఈ ఆధునాతన సౌకర్యాలను రైల్వే బోర్డు, ఇండియన్ రైల్వే హెల్త్ సర్వీసెస్ (ఐఆర్‌హెచ్‌ఎస్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ జగదీష్ చంద్ర ప్రారంభించారు. జగదీష్ చంద్ర మాట్లాడుతూ... కొత్తగా అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులతో పాటు పదవీ విరమణ పొందిన వారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. సౌకర్యాలను అభివద్ధి చేసినందుకు వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.

68 ప్రత్యేక కంట్రోల్ రూములు

- గ్రేటర్‌లో టిజిఎస్‌పిడిసిఎల్ ఏర్పాట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం సజావుగా జరిగేందుకు తమ వంతుగా టిజిఎస్‌పిడిసిఎల్ భద్రతా ఏర్పాట్లు చేసింది. శోభాయాత్ర నిర్వహించే రూట్లలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మూడు జోన్ల పరిధిలో 68 ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, అదనపు లోడ్‌లను అందుకోవడానికి అదనంగా 104 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. విధుల్లో 101 సబ్ డివిజన్ స్థాయి టీంలు నిమజ్జన కార్యక్రమం ముగిసే వరకు నిరంతరం అందుబాటులో ఉండేలా డ్యూటీ చార్ట్ విద్యుత్ అధికారులకు సిఎండి ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు జారీ చేశారు.

అధికారులతో సిఎండి టెలీ కాన్ఫరెన్స్

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వచ్చే నెల 6న నిర్వహించనున్న గణేష్ విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమానికి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తగు ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు శనివారం సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జోనల్ చీఫ్ ఇంజనీర్లతో, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ డైరెక్టర్లు శివాజీ, డాక్టర్ నర్సింహులు, చక్రపాణి, కృష్ణారెడ్డి, మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజినీర్ కామేష్, రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజినీర్, పాండ్య, మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌కు పలు కీలక సూచనలు చేశారు. పెద్ద విగ్రహాలు ప్రతిష్టించిన మండపాలను, ఆ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించే వీధులను, రహదారులను పరిశీలించాలని తెలిపారు. రోడ్ క్రాసింగ్‌లు, వదులుగా ఉన్న తీగలను సరి చేయటం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, అవసరమైన చోట ఇన్సులేషన్ ఏర్పాటు, ఇనుప స్తంభాలు, ఫ్యూజ్ బాక్సులు ఉన్న చోట పివిసి పైపులు, ప్లాస్టిక్ షీట్లు ఏర్పాటు చేయడం వంటి పనులు పూర్తి చేసినట్టు అధికారులు సిఎండికి తెలియజేశారు. దీనికి తోడు ప్రతి సెక్షన్ పరిధిలో నిరంతరం అందుబాటులో ఉండే విధంగా షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. గ్రేటర్‌లో వివిధ విభాగాలైన ఆపరేషన్, లైన్స్, సీబీడీలకు చెందిన 101 సబ్ డివిజన్ స్థాయి టీంలకు తోడు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది కూడా విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు.

అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మేడ్చల్ జోన్ పరిధిలో 71 నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేకంగా 31 కంట్రోల్ రూమ్స్, అదనంగా 43 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జోన్ పరిధిలో 29 నిమజ్జన ప్రాంతాల్లో 25 కంట్రోల్ రూమ్స్, అదనంగా 22 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. మెట్రో జోన్ పరిధిలో 10 ప్రాంతాల్లో ప్రత్యేకంగా 12 కంట్రోల్ రూమ్స్, అదనంగా 39 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత

నిమజ్జనం నేపథ్యంలో పెద్ద విగ్రహాల శోభాయాత్ర నిర్వహించే మార్గాలను విద్యుత్ అధికారులు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలి. ఎలాంటి అవాంతరాలూ జరగకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలి. నగరంలో నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సరఫరా తీరు తెన్నులను పర్యవేక్షించడానికి, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకునేందుకు సంస్థ డైరెక్టర్‌లను, చీఫ్ ఇంజినీర్లను ఇన్‌చార్జీలుగా నియమించాం.

సమావేశంలో మాట్లాడుతున్న శిఖా గోయెల్

ఎఐలో జవాబుదారీతనం అత్యవసరం

- ఐఎస్‌ఎసిఎ సదస్సులో శిఖా గోయెల్

ప్రజాశక్తి - హైదరాబాద్ : టెక్నాలజీలో నైపుణ్యాలను అందించే ఐఎస్‌ఎసిఎ హైదరాబాద్ ఛాప్టర్ 25 సంవత్సరాల సందర్భంగా వార్షిక సదస్సును ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో 'ట్రస్ట్ ఎఐసిఎస్-2025', ఎఐ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్, సైబర్‌సెక్యూరిటీ, అండ్ ప్రైవసీ" అనే థీమ్‌తో జరిగిన ఈ సదస్సును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డైరెక్టర్ జనరల్ ఐపిఎస్ శిఖా గోయెల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిఖా గోయెల్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఎఐ వ్యవస్థలను రక్షించడం, నైతిక ఉపయోగం అత్యవసరం. ఐఎస్‌ఎసిఎ వంటి సంస్థలు కీలకమన్నారు. ఈ సమావేశానికి ఆ చాప్టర్ ముఖ్యులు జిసిఎస్ శర్మ, రాజ్ పవార్ ఎం. శరత్ కుమార్. మైత్రేయ్ గణపతి తదితరులు హాజరయ్యారు.

అనాజ్‌పూర్‌లో సీలింగ్ రైతుల ఆందోళన

- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ అనాజ్‌పూర్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సిపిఎం నాయకుల అరెస్టులను ఖండిస్తూ భూపోరాట రైతులు ఆందోళన చేశారు. సీలింగ్ భూముల్లో రైతులకు పట్టా పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొంతకాలంగా సిపిఎం ఆధ్వర్యంలో భూపోరాటం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవ్వడంతో ముందస్తుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని హైదరాబాద్‌లో పోలీసులు హౌస్ అరెస్టు చేయగా, రంగారెడ్డి జిల్లా నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహ, అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన 15 మంది భూబాధిత రైతులను ఉదయాన్నే అరెస్టు చేశారు. దాంతో గ్రామంలో సీలింగ్ రైతులు, గ్రామస్తులు స్వచ్ఛందంగా రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో చేశారు. అరెస్టు చేసిన నాయకులను, గ్రామస్తులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో చివరకు అరెస్టు చేసిన వారిని విడుదల చేశారు.

అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహ అనాజ్‌పూర్ గ్రామానికి వచ్చి రైతులతో మాట్లాడారు. పార్టీ ఎటువంటి బంద్, ముట్టడి కార్యక్రమానికి పిలుపు ఇవ్వకున్నా కొంతమంది రాజకీయ నాయకుల ప్రోద్బలంతో తమను

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

అరెస్టు చేశారని తెలిపారు. రైతులందరికీ పట్టా పాస్ బుక్కులు వచ్చే వరకు అరెస్టులు, నిర్బంధాలు, కేసులు పెట్టినా భూపోరాటం ఆగదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని రైతులతో సంప్రదింపులు చేసి పట్టా పాసుబుక్కులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుమలత, నాయకులు బి.కనకయ్య, గుండె శివ, వర్గాల ముత్యాలు, కావలి జంగయ్య, చిర్ర శివకుమార్, ఎం.శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ వరకాల బాలరాజ్, రైతులు, మహిళలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేతల అరెస్ట్

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చెన్నారెడ్డిగూడలో సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యను, జిల్లా కమిటీ సభ్యులు గోరెంకల నరసింహను తిప్పాయిగూడలో పోలీసులు అరెస్టు చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి బుగ్గరాములు, నాయకులు స్వప్న, అరుణ, యాదగిరి, దశరథ, భూపోరాట రైతులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌కు తరలించారు. యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహతోపాటు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పి.అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు పి.బ్రహ్మయ్య, చందు నాయక్‌ను అరెస్టు చేసి గ్రీన్ ఫార్మాసిటీ పిఎస్‌కు తరలించారు. కందుకూరులో పార్టీ నాయకులు బుట్టి బలరాజ్‌ను అరెస్టు చేశారు.

శాస్త్రీయ విద్యను అలవర్చుకోవాలి

- అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ మహీపతి శ్రీనివాస్
- బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పురస్కారాలు

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులు శాస్త్రీయ విద్యను అలవర్చుకున్నప్పుడే తమ భవిష్యత్‌ను తామే తీర్చిదిద్దుకోగలుగుతారని అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ డా. మహీపతి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివి 500, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులకు తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదువుకున్నప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఇష్టం లేని చదువులకు బలవంతంగా పంపించడం వల్ల చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని, ఫెయిల్ అవుతున్నారని, మానసికంగా కుంగిపోతున్నారని చెప్పారు. ఏ గ్రూపులో అడ్మిషన్ తీసుకున్నా కష్టపడి చదివితే భవిష్యత్ బాగుంటుందని, సమయం టఔథా కాకుండా ఉంటుందని సూచించారు. ఎంత కష్టం అనిపించినా ఆ కష్టాన్ని మరిచిపోయి ఏ విషయాన్ని ఏ పద్ధతిలో చదివితే సులువుగా అర్థమవుతుందో అధ్యాపకులు, అనుభవమున్న వారి వద్ద సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. నేడు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురైన తరగతుల వారే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, అలా కష్టపడి చదువుకొని మంచి మార్కులు సాధించిన వారంతా గొప్ప విద్యార్థులేనని కొనియాడారు.

విజ్ఞానదర్శిని రాష్ట్ర అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల నుంచే ప్రయివేటు విద్యాసంస్థలు వచ్చాయి తప్ప అంతకుముందు మేధావులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారేనని తెలిపారు. ఐన్‌స్టీన్, లూథర్‌ఫర్డ్, థామస్ అల్వా ఎడిసన్ వంటి అనేక మంది శాస్త్రజ్ఞులు, ప్రపంచ మేధావులు ఎటువంటి సౌకర్యాలు లేని కాలంలో స్వయంగా కష్టపడి శాస్త్ర పరిశోధనలు చేసి నేడు ప్రపంచ ప్రఖ్యాతిగాంచారన్నారు.

భారతదేశంలో అంబేద్కర్ అనేక అవమానాలకు గురవుతూ చదువుకున్నారని గుర్తు చేశారు. ప్రతి విషయాన్నీ ఇది ఎందుకు ఇలా జరుగుతుంది అని ప్రశ్నించుకోవాలని, తరగతి గదిలో అధ్యాపకులను ప్రశ్నించాలని సూచించారు. బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య మాట్లాడుతూ.. తెలంగాణ బాలోత్సవం ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం అని చెప్పారు. ఈ మేరకు గత నెలలో 7, 8, 9 తరగతులలో ప్రావీణ్యం చూపించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇచ్చామని, ఇప్పుడు పదవ తరగతి విద్యార్థులకు ఇస్తున్నట్టు తెలిపారు.

ప్రతి ఏడాదీ పదివేల మందికిపైగా విద్యార్థులకు దాదాపు 30 రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం నవంబర్‌లో నిర్వహించే బాలోత్సవాల్లో మీరంతా పాల్గొనాలని సూచించారు. అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ఎంపవర్‌మెంట్ డ్రాఫ్ట్ తయారవుతుందని, ఈ సంవత్సరం నుంచి బాలికల భవిష్యత్, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి బాలోత్సవం కమిటీ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా.. సభ్యులు సుజావతి, మమత, రూప రుక్మిణి, అంకమ్మ, మహేష్ దుర్గే, ఆఫీస్ సెక్రటరీ బ్రాహ్మణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్

పెసర పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న అన్ని రకాల పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, రైతులకు యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని చిన్న మునగాల గ్రామంలో రైతులతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ.. భారీ వర్షాలతో పెసర పంట పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాల దిగుబడి వచ్చే పెసర పంట ఎందుకూ పనికి రాకుండా పొలంలోనే మొలకెత్తి బూజు పట్టి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, వరి ఇతర పంటలూ ముంపునకు గురయ్యాయని, కొన్ని ప్రాంతాల్లో ఇసుక మేటలు పడటంతో రైతులకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. కౌలు రైతులు.. ఎకరాకి రూ.20వేల నుంచి రూ.30 వేలు ముందస్తు కౌలు చెల్లించి పంటలు సాగు చేస్తే భారీ వర్షాల మూలంగా పంటలు దెబ్బతిని దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కౌలు రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందించాలని, పంట నష్టంపై సమగ్ర సర్వే చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు అవసరమైన యూరియా సకాలంలో సరఫరా చేయటంలో కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విమర్శ, ప్రతి విమర్శలు చేసుకోవటంతో సమస్య పక్కదారి పడుతుందని, రాష్ట్ర అవసరాలకు తగిన విధంగా యూరియా సరఫరా చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అందుకు తెలంగాణ నుంచి ఉన్న కేంద్ర మంత్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ..రైతులకు పరిహారం అందించకుండా ఉంటే రైతుల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకులు చెరకుమల్లి కుటుంబరావు, చింతనిప్పు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.